

# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 800 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# కార్ల్ మార్క్స్ సమగ్ర జీవిత చిత్రణ

## 1వ భాగం

200 సంవత్సరాల ముందు జన్మించి, 64 సంవత్సరాలు జీవించి, మరణించిన తర్వాత కూడా శతాబ్దాల తరబడి ప్రపంచం లోని అనేక దేశాల్లో కోట్లాది మంది ఆలోచనా విధానాలనూ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో ప్రభావితం చేసిన ఒక విశిష్ట వ్యక్తిని గురించి తెలుసుకుందాం.

★ప్రపంచ కార్మికులారా ఏకంకండి.

★పోరాడితే పోయేదేమీ లేదు, సంకెళ్ళు తప్ప.

★జయించడానికి మీ ముందున్నది ప్రపంచం.

★మానవ జాతి గత చరిత్రంతా వర్గ పోరాటాల చరిత్రే.

ఈ వర్గ పోరాటాలు వివిధ దేశాల్లో, వివిధ రూపాల్లో, వివిధ కాలాల్లో జరిగినా, ఏనాటి సమాజం లోనైనా, ఒక వర్గాన్ని, మరొక వర్గం దోచుకోవడం. అప్పటికీ, ఇప్పటికీ కొనసాగుతూనే వుంది. ఆ వర్గాలు,

★పెట్టుబడి దారులూ, శ్రామికులూ,

★యజమానీ, సేవకుడూ,

★పని చేయించుకునేవాడూ, పని చేసేవాడూ,

★పాలకులూ, పీడితులూ,

★సంపదను తన గుప్పెట్లో పెట్టుకునే వాడూ, తిండి గింజల కోసం రోజంతా శ్రమించే వాడూ,

ఇలా ఎన్ని రకాలుగానైనా ఉండవచ్చు. "సమాజంలోని ఈ వర్గ వైవిధ్యాలు సమసిపోవాలి. సామ్యవాద నీడలో ప్రజలందరూ సమానమే. ప్రకృతి వనరుల మీద అందరికీ సమానమైన హక్కులు వుండాలి. ఎవరైనా శ్రమకు తగ్గ ప్రతి ఫలాన్ని మాత్రమే పొందాలి." అనే భావాలు కార్యరూపం దాల్చాలంటే, విప్లవ పోరాటాలు తప్పనిసరి. అది నా జీవిత కాలంలో నేను చూడకపోవచ్చు. కానీ, నా మరణాంతరం అయినా, నా సిద్దాంతాలూ, నా ఆలోచనా విధానాలూ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తాయి. నేను ఆశించిన సోషలిస్టు సంబంధాలు ఏర్పడతాయి. నేను ఆశించిన "వ్యక్తి గత ఆస్తి రద్దు కావాలి" అనే నినాదం వలననే శ్రామిక వర్గ ఉద్యమం వర్ధిల్లుతుంది. సమిష్టిగా పనిచేసి, లభించిన ఫలితాన్ని అందరూ సమానంగా పంచుకోవాలి. అందరికీ దాని మీద హక్కు వుంది.

ఒక కార్మికుడు రోజుకి 5 డాలర్ల వేతనానికి ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడనుకోండి. ఆ 5 డాలర్లకు తగినంత పని 4 గంటలలోనే పని చేసేస్తాడనుకోండి. మిగతా సమయంలో అతడి శ్రమ సృష్టించినదంతా "అదనపు విలువ" అదంతా యజమాని లాభాల ఖాతా లోకే వెళ్ళిపోతుంది. ఇదే "శ్రమ దోపిడీ" వెనకాల జరిగే తతంగం.

ఒక వ్యక్తి తన స్వంత మేలుకోసమే పాటు పడితే, అతను ఒక సైంటిస్టో, గొప్ప రుషో, కవిగానో తయారు కావచ్చు. గానీ, ఎప్పటికీ ఒక పరిపూర్ణ వ్యక్తిగా, మహా పురుషుడుగా రూపుదిద్దు కోలేడు. మానవ జాతికి అత్యధికంగా మేలు చేయాలి అనుకున్నట్టయితే, అటువంటి వృత్తిని ఎంచుకున్నట్టయితే, మనం దేనికీ తలవంచాల్సిన అవసరం లేదు. ఎందుచేతనంటే, అది అందరి కోసం చేసే త్యాగం. తద్వారా లభించే ఆనందం అనిర్వచనీయం.

ఇలాంటి అనేకానేక ఆలోచనలతో , సాంఘిక సిద్ధాంతాలతో, సామాజిక విశ్లేషణలతో,...”ది హోలి ఫ్యామిలీ” “ది క్లాస్ స్ట్రగుల్ ఇన్ ఫ్రాన్స్” “ది ప్రావర్ట్ ఆఫ్ ఫిలాసఫీ” ” వెజ్ &లేబర్” “కేపిటల్” కమ్యూనిస్ట్ మేనిఫెస్టో” జర్మన్ ఐడియాలజీ” లాంటి దాదాపు 30 పైగా పుస్తకాలనూ, అనేక విశ్లేషణా పత్రాలనూ రచించి, సామ్యవాద కమ్యూనిస్ట్ పితామహుడిగా, ప్రపంచ శ్రామికపోరాట నిర్మాతగా, సామ్యవాద సిద్దాంత కర్తగా, అభిమానులచే ప్రశంసించబడిన సామాజిక శాస్త్ర వేత్తా, రాజకీయ ఆర్థిక తత్వ వేత్తా, సోషలిస్ట్ విప్లవకారుడూ కార్ల్ మార్క్స్.

సోషలిజం, కమ్యూనిజం అనే భావాలకు 19 వ శతాబ్దంలో ఆధునిక రూపం ఇచ్చిన వాడు. తన ఆలోచనా విధానాలన్నిటికీ “మార్క్సిజం” గా, తరువాత తరాలు గుర్తించేటంతటి, అత్యంత శక్తివంతమైన ప్రభావాన్ని చూపేటంతటి గుర్తింపు పొందిన వాడు. ఒక వ్యక్తి. ఒక శక్తి కార్ల్ మార్క్స్.

తన ఆలోచనలకు “మార్క్సిజం” గా గుర్తింపు పొందిన వాడు. మార్క్సిజం పునాదుల మీద వివిధ రూపాల్లో, సోషలిస్ట్ సిద్ధాంతంలో అంతకుముందు మరి కొన్ని దేశాలూ, 1991 రష్యా, చైనా, వియత్నాం, లావోస్, క్యూబా లాంటి దేశాల ప్రభుత్వాలు మార్క్సిజం వలన ప్రభావిత మయ్యాయని ప్రత్యేకంగా ప్రస్తావించు కోనక్కరలేదు. మార్క్స్ భావాలను ప్రపంచ వ్యాపితంగా ఎంతగా గౌరవిస్తారో, ఎంతగా ఆచరిస్తారో.... ఆ సిద్ధాంతం లోని లోపాలనూ, వాటి వల్లవచ్చే పరిణామాలనూ, వాటితో విభేదించే వారు అంత మంది వున్నారు. మార్క్స్ సిద్దాంతాలను తమకు అనుగుణంగా మలచుకొని, తమని తాము కమ్యూనిస్ట్ గా ప్రకటించుకున దేశాల్లో “కమ్యూనిస్ట్ పేరు మీద నియంతృత్వం కొనసాగించారని “అనే వాళ్ళూ వున్నారు. వాటిల్లోని మంచీ చెడూలను విశ్లేషించడం ఈ పుస్తకం ఉద్దేశ్యం కానే...కాదు. ప్రపంచ దేశాలను ఇంతగా ప్రభావితం చేసిన కార్ల్ మార్క్స్ వ్యక్తి గత జీవిత విశేషాలనూ, నమ్మిన సిద్దాంతం కోసం కష్టాలనూ, పేదరికాన్నీ సంతోషంగా స్వీకరించే మార్క్స్ త్యాగనిరతినీ తెలుసుకోవడమే ఈ పుస్తకం ముఖ్య ఉద్దేశ్యం.

కార్ల్ మార్క్స్ ఆలోచనల్లో తీవ్రవాది. తను చెప్పింది పది మంది వినాలనే పట్టుదలతో, తన భావాలను గ్రంథస్థం చేసిన వాడు. ప్రచారం చేసిన వాడు. శ్రామికజన చైతన్యమే ఏకైక లక్ష్యంగా, జీవితాంతం కృషి చేసిన వాడు. తన ఆలోచనలూ, తన విశ్లేషణలూ తన తత్వంగా శతాబ్దాలుగా చర్చనీయాంశంగా చేయగలిగిన వాడు.

తన సిద్దాంతాలనూ, తన ఆలోచనలనూ ఆచరించడంలో ఎంత నిబద్దతతో ఉండేవాడో అన్నది ఒక కోణమైతే.... తను జీవించిన 64 ఏళ్ళ కాలంలో 40 ఏళ్ళు దుర్భర దారిద్ర్యంతో బ్రతుకు పోరు సాగించిన వాడు. తన కంటే నాలుగేళ్ళు పెద్దదయిన ప్రియురాలిని వివాహం చేసుకొని, అన్ని వేళలా తననే అంటి పెట్టుకున్న ఆమెకు కూడా ఒకానొక సమయంలో ద్రోహం చేసాడా? అన్న అనుమానానికి ఆస్కారం ఇచ్చిన వాడు. లండన్ లో రెండు గదుల ఇంట్లో నివసించిన రోజుల్లో, సరైన పోషకాహారం పెట్టలేక, తన 7 గురి సంతానంలో, 4 పిల్లలు కళ్ళ ముందే చనిపోతుంటే, నిస్సహాయంగా చూస్తుండి

పోయినవాడు. ఏ రోజూ స్థిరమైన వుద్యోగం లేక, సరైన ఆదాయం లేక, పూట గడవడానికి ఇంట్లో వున్న సమస్త వస్తువుల్నీ, ఒంటి మీద వున్న కోటును కూడా అమ్ముకున్నవాడు. అప్పుల వాళ్ళ నుండి తప్పించు కోవడానికి పేర్లు మార్చుకోక తప్పని వాడు. తాను నిర్మించదలచుకొన్న విప్లవోద్యమాల పనుల దృష్ట్యా స్థానిక ప్రభుత్వాల చేత బహిష్కరింపబడి, ఒక దేశం నుండీ, మరొక దేశానికి వెళుతూ, చివరకు ఏ దేశ పౌరసత్వమూ లేని స్థితికి చేరిన వాడు. భార్యా పెద్ద కూతురూ కాన్సర్ తో మరణిస్తుంటే, ప్రత్యక్షంగా గమనిస్తూ ఉండిపోయినవాడు.

ఫెడరిక్ ఎంగెల్స్ లాంటి ప్రాణ మిత్రుడ్ని సంపాదించిన వాడు. తుది శ్వాస వరకూ తన తండ్రి, భార్యా, పెద్దకూతుర్ల ఫోటోలు దాచుకున్న వాడు. ఒళ్ళంతా పుళ్ళతో, ఊపిరితిత్తులలో విపరీతమైన బాధ. కూర్చున్నా, నిలుచున్నా భరించలేని నొప్పి. కష్టాల్, నష్టాల్, కోపాల్, తాపాల్ ఏదైనా కానీ, ఏమైనా కానీ తను రచిస్తున్న “కేపిటల్” పూర్తి చేసే వరకూ రక్త మాంసాలు ధార పోసిన వాడు. మరణాంతరం తనతో శ్మశానానికి వచ్చేవాళ్ళని 10,12 మందినిమాత్రమే మిగుల్చుకున్నవాడు. ఒక మేధావి. ఒక తాత్వికుడు. కార్ల్ మార్క్స్ జీవితంలో ఎన్నో బాధలూ, కోణాలూ వున్నాయి.

అన్నిటికీ మించి రాజీ పడనీ మనస్తత్వం. 17 సంవత్సరాల వయస్సు నుండి 64 వయస్సు వరకూ శ్రామిక జన చైతన్యం కోసమే బ్రతికిన అతని జీవిత విశేషాలు తెలుసు కోవాలంటే 200 సంవత్సరాలు వెనక్కి వెళ్ళాలి.

★★★

200 వందల సంవత్సరాల క్రితం యూరప్ లో “జర్మన్ కాన్ఫడరేషన్ “అనే, వివిధ దేశాల కూటమి వుండేది. దేశాలు అనే కన్నా, రాజ్యాలు అనవచ్చు. అప్పటికి రాజ్యాలు వున్నాయి. ఆ జర్మన్ కాన్ఫడరేషన్ లో “ప్రష్యా” అనే రాజ్యంలో “ట్రయర్” అనే చిన్న పట్టణం లేదా పెద్ద గ్రామం వుండేది. ఆ ట్రయర్ అనే వూరు అప్పటి వరకూ ఫ్రాన్స్ లో ఒక భాగంగా వుండి, తరువాత, ప్రష్యాలో భాగం అయ్యింది. ప్రస్తుతం ఈ ట్రయర్ జర్మనీ లో వుంది. అది 1815 వ సంవత్సరం. కార్ల్ మార్క్స్ తండ్రి పేరు “హెన్రిచ్”. న్యాయవాది. బాగానే సంపాదించేవాడు. మరీ లేని వాళ్ళమీ కాదు. తండ్రి చాలా పొదుపుగా సంసారాన్ని చేస్తుండేవాడు. తల్లి పేరు” హేన్రిట్”. ఆమెకు పుట్టింటి నుండి కొంత ఆస్తి రావలిసి వుంది. అయితే, అప్పటికి ఏమీ రాలేదు. ఆమెది నెదర్లాండ్స్. అందుకని జర్మన్ భాష సరిగ్గా వచ్చేది కాదు. అందుకే, బయటకు వెళ్ళేది కాదు. “మా అమ్మ వలన ఇంట్లో వాతావరణం స్తబ్దు గా వుండేది. ఎక్కడికీ వెళ్ళేది కాదు. ఎవరితోనూ సరిగ్గా మాట్లాడలేకపోయేది” అని మార్క్స్ తన లేఖల్లో రాసుకున్నాడు.

మార్క్స్ తలిదండ్రులకు మొత్తం తొమ్మిది మంది పిల్లలు. వాళ్ళందరికీ చదువులు చెప్పించాలి. ఇంకా అనేక బరువు బాధ్యతలు వుండడం వలన మార్క్స్ తండ్రి ‘హెన్రిచ్’ ఖర్చు విషయంలో చాలా జాగ్రత్తగా ఉండేవాడు. పిల్లల్లో

మూడవ వాడు కార్ల్ మార్క్స్. కార్ల్ మార్క్స్ 1818 మే 5 న జన్మించాడు. కార్ల్ మార్క్స్ కంటే ముందు, ఒక అమ్మాయీ, ఒక అబ్బాయి పుట్టారు. పెద్దబ్బాయి చనిపోయాడు. అందుకని కార్ల్ మార్క్స్ నే పెద్దబ్బాయిగా చూసుకునేవాడు తండ్రి. మార్క్స్ తల్లికి ఒక చెల్లెలు వుంది. ఆమె భర్త పేరు “ఫిలిప్స్” (ఇప్పుడు మనం వాడుతున్న ఫిలిప్స్ ఎలక్ట్రానిక్స్ సంస్థని 130 సంవత్సరాల క్రితం మార్క్స్ బాబాయ్ కొడుకూ, అతని కొడుకూ స్థాపించారు. తరువాత కాలంలో మార్క్స్ ఆర్థిక ఇబ్బందుల వలన వాళ్ళ ఇంటికి వెళ్ళడం, వాళ్ళు కొంత వరకూ సహాయం చెయ్యడం తరవాత సంగతి.)

మార్క్స్ పుట్టేసరికి ‘ట్రయర్’ పరిస్థితి ఎలా ఉండేదంటే? యూరప్ తో పోలిస్తే, జర్మనీ ఇంకా పారిశ్రామికంగా ఇంకా అభివృద్ధి చెందలేదు. అప్పుడప్పుడే ఫ్యాక్టరీలు వస్తున్నాయి. జనాభా కొద్ది కొద్దిగా పెరుగుతోంది. కార్మికుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఇదంతా 200 సంవత్సరాల క్రితం నాటి సంగతి అనే విషయం గుర్తుంచు కోవాలి. ఈ ట్రయర్ నగరానికి వస్తే, అక్కడ ద్రాక్షతోటలు ఎక్కువగా ఉండేవి. ఫ్యాక్టరీలు రాలేదు. క్రైస్తవ మత ప్రాబల్యం ఎక్కువగా వుండేది. మార్క్స్ తండ్రి యూదు మతస్తుడు. అంటే, జూయిష్ కమ్యూనిటికి చెందిన వాడు.

మార్క్స్ తల్లి తరుపు పెద్ద వాళ్ళందరూ యూదు మత గురువులు.12 సంవత్సరాలు వచ్చేవరకూ మార్క్స్ ని స్కూలుకి పంపించలేదు. ఎందుకంటే, క్రైస్తవ మత ప్రాబల్యం వలన యూదు పిల్లలు చదువుకునే పరిస్థితి లేదు. క్రైస్తవ మతం లోనికి మారినప్పటికీ, తోటి పిల్లలనుండీ, ఉపాధ్యాయుల నుండి వివక్షతను ఎదుర్కోవలసి వచ్చేది. మార్క్స్ కు12 సంవత్సరాలు వచ్చేవరకూ ఇంట్లోనే చదువు చెప్పాడు వాళ్ళ నాన్న. 12 సంవత్సరాలు దాటిన తర్వాత, 1830లో హై స్కూలు లో చేర్పించాడు. ఆ హైస్కూలు హెడ్ మాస్టారు మార్క్స్ తండ్రికి స్నేహితుడు. ఆ పరిచయం తో “మా అబ్బాయిని కాస్త జాగ్రత్తగా చూసుకో” అని అతనికి జాగ్రత్తలు చెప్పి చేర్పించాడు. 5 సంవత్సరాలు అక్కడే చదువుకున్నాడు మార్క్స్.

ఆ హెడ్ మాస్టారు ప్రష్యా రాజ్యానికి వ్యతిరేకంగా ఉండేవాడు. ప్రష్యా రాజ్యం యొక్క ధోరణుల్ని వ్యతిరేకిస్తూ, వుపాధ్యాయులకీ, విద్యార్థులకీ కరపత్రాలు ఇచ్చేవాడు. ఇదంతా తెలిసిన ప్రష్యా రాజ్య ప్రతినిధులు అతన్ని, ఆ ప్రధానోపాధ్యాయ పదవి నుండి తొలగించారు. ‘పాలకుల ధోరణి ఎలా వుంటుంది? అణచివేత ఎలా వుంటుంది?’ ఇలాంటి వన్నీ గమనిస్తూ ఉండేవాడు మార్క్స్ 12, 13 ఏళ్ళ వయసులోనే. చదువులో పెద్ద తెలివి గలవాడు ఏమీ కాదు. ఫస్ట్ క్లాసు స్టూడెంట్ అస్సలు కాదు. కానీ, మాటలు చెప్పడం లోనూ, వాదనల్లోనూ అందరినీ మించి పోయేవాడు.

ఇక తండ్రివిషయానికి వస్తే – క్రైస్తవులు తప్ప మరెవరూ కూడా న్యాయవాద వృత్తిని చేయకూడదని ప్రష్యా ప్రభుత్వం కొన్ని చట్టాలను తీసుకువచ్చింది. అలాంటి పరిస్థితిలో తప్పని సరి బ్రతుకు తెరువు కోసం మార్క్స్ నాన్న 1817 లో అంటే, మార్క్స్ పుట్టడానికి ఒక సంవత్సరం ముందు, యూదు మతం నుండి క్రైస్తవ మతం లోనికి మారాడు. ఆ తరువాత మరో ఎనిమిది సంవత్సరాలకి అంటే 1825 లో అతని భార్య కూడా క్రైస్తవ మతం తీసుకుంది. ఎందుకు అన్ని సంవత్సరాలు

ఆలస్యంగా. అంటే? ఆమె తండ్రి జీవించి వుండగా ఆమె మారడానికి అతను ఒప్పుకోలేదు. తరువాత పిల్లలందరినీ కూడా హెన్రిచ్ క్రైస్తవ మతం లోనికి మార్పించాడు. మొత్తానికి 7,8 సంవత్సరాల కాలంలో అందరూ క్రైస్తవ మతం లోకి మారిపోయారు. ఎందుకంటే, అక్కడ యూదులుగా బతికే పరిస్థితి లేదు. అదీ, మార్క్స్ చిన్ననాటి పరిస్థితి. ఆనాటి వాతావరణం.

మార్క్స్ చిన్నతనంలో చాలా తెలివిగా, అల్లరిగా కూడా ఉండేవాడు. పిల్లలందరిలోకీ రంగు తక్కువగా ఉండేవాడు. తండ్రి చాలా ప్రేమగా చూస్తుండేవాడు. చెల్లెళ్ళకీ, అక్కకీ మాత్రం చాలా భయంకరుడుగా ఉండేవాడు. మట్టి చేతులతో రొట్టెలు చేసి, వాటిని బలవంతంగా చెల్లెళ్ళ చేత తినిపించడం. అలాగే, చెల్లెళ్ళ మీదా, అక్క మీదా కూర్చొని, గుఱ్ఱపుస్వారీ చెయ్యడం లాంటి అల్లరి పనులు చేసేవాడు. ఎన్ని చేసినా గానీ, వాళ్ళు మార్క్సును అభిమానం గానే చూసేవారు. ఎందుకంటే, బాగా కథలు చెప్పేవాడు. తన వాదనతోటీ, సంభాషణా చాతుర్యం తోటీ అవతలి వాళ్ళను ఒప్పించ గలిగే గుణం అతనికి 6,7 సంవత్సరాల వయస్సు నుండే అలవడింది. అందుకనే చెల్లెళ్ళు అతను ఎంత అల్లరి చేసినా భరించేవాళ్ళు.

అతను మాట్లాడుతుంటే, ఎదురు తిరిగి చర్చించే ధైర్యం కూడా ఎవరూ చేసేవారు కాదు. లాటిన్, గ్రీకు భాషలు బాగా మాట్లాడేవాడు. ఫ్రెంచ్ లోనూ, లెక్కల్లోనూ బాగా వెనకబడి ఉండేవాడు. చరిత్ర అనేది పెద్దగా వంట బట్టేది కాదు. (విచిత్రం ఏమిటంటే, తరువాత రోజుల్లో చరిత్ర లోనీ వర్గాల గురించీ, వర్గ పోరాటాల గురించి చెప్పిన మార్క్స్ చదువుకునే రోజుల్లో చరిత్ర గురించి పెద్దగా పట్టించుకునేవాడు.) అతను హైస్కూలులో వుండగా పెద్దగా స్నేహితులు కూడా ఉండేవారు కాదు. ఎవరైనా, ఎప్పుడైనా ఏడిపించడానికి ప్రయత్నిస్తే వాళ్ళమీద ఆశువుగా కవిత్వం చెప్పి వాళ్ళనే తిరిగి ఏడిపించేవాడు. ఎదురు తిరిగి రిపార్టీలు లు ఇచ్చేవాడు. అందుకనీ అతను మాట్లాడితే వినడమే గానీ, చాలా దగ్గరగా మాత్రం ఎవరూ వుండేవారు కాదు. ఒకే ఒక్క మిత్రుడు మాత్రం ఉండేవాడు. అతని పేరు "ఎడ్గర్". అసలు ఎడ్గర్ కంటే, అతని తండ్రి మార్క్స్ కి బాగా మిత్రుడు అయ్యాడు.

అతని, ఎడ్గర్ తండ్రి, పేరు "లుడ్విగ్". అతను అదేవూరి వాడు. బాగా సంపన్న కుటుంబం. రాజ వంశీకులు. అది ప్రష్యా రాజ్యం అనుకున్నాం కదా! ఈ లుడ్విగ్, అతని బంధువులూ రాజాస్థానంలో పనిచేస్తుండేవారు. అయినా సరే, ఈ లుడ్విగ్, మార్క్సు వాళ్ళ కుటుంబంతో సన్నిహితంగా ఉండేవాడు. ఆయనకీ, మార్క్స్ కీ మంచి స్నేహం కుదిరింది. అప్పటికి మార్క్స్ వయసు 12. అతని వయసు 35. మార్క్స్ నాన్న, కన్నా పెద్దవాడు. మార్క్స్ తో ఎందుకు అంత స్నేహం ఏర్పడింది అంటే, మార్క్స్ ఆలోచనా విధానం గానీ, విశ్లేషించే విధానం గానీ, ప్రశ్నలుగానీ లుడ్విగ్ కు బాగా నచ్చాయి. అందుకని, తరచూ మార్క్స్ ను తన దగ్గరకు పిలిపించుకుని, అతని తోటి చర్చలు చేస్తుండేవాడు. హోమర్, షేక్స్పియర్

రచనలు చదివి వినిపించడం చేస్తుండేవాడు లుడ్విగ్. ఈ లుడ్విగ్ సాహచర్యంతో మార్క్స్ చాలా విజ్ఞానం సంపాదించుకున్నాడు. ఇదంతా హైస్కూల్ చదువులో ఉండగానే.

ఈ లుడ్విగ్ కు ఒక కూతురు వుంది. అంటే, ఎడ్గర్ కి అక్క. ఆమె పేరు జెన్నీ. ఈ జెన్నీ, మార్క్స్ అక్క సోఫీకి మంచి మిత్రురాలు. ఆ రకంగా, ఆ కుటుంబం యొక్క స్నేహం వలనా, ఆమె తరచూ జెన్నీ, మార్క్స్ ఇంటికి వస్తూ వుండేది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, జెన్నీ, మార్క్స్ కంటే 4 సంవత్సరాలు పెద్దది. వారి మధ్య ప్రేమ లాంటి భావనలు ఏమీ ఉండేవి కావు. మార్క్స్ స్కూలుకి వెళ్ళిపోతూ ఉండేవాడు. మార్క్స్ 7 వ తరగతిలోనో, 8 తరగతిలోనో వుండే రోజుల్లోనే, ఈ జెన్నీ కి ఒక వివాహం నిర్ణయమయి, నిశ్చితార్ధం కూడా అయిన తరవాత, జెన్నీ వివాహం "వద్ద" ని చెప్పేసింది. దానికి కుటుంబ సభ్యులు

" నీ యిష్టము వచ్చిన అబ్బాయినే చేసుకో. తప్పిపోయినా పర్వాలేదు." అన్నారు. ఆ రకంగా నిశ్చితార్ధం అయి కూడా తప్పిపోయింది. ఇది మామూలుగా జరిగిన సంఘటన. ఇందులో మార్క్స్ ప్రమేయం ఏమీ లేదు. పైగా అప్పటికీ, మార్క్స్ కి చిన్న వయసు.

మార్క్స్ స్కూలు చదువు అయిపోయి, యూనివర్సిటీకి వెళ్ళే సమయం వచ్చింది 1835 లో. అంటే అప్పటికి మార్క్స్ కు పదిహేడు సంవత్సరాలు. అసలు ఆ కుటుంబంలో మొట్ట మొదటసారి యునివర్సిటికి వెళుతున్నది మార్క్సే. తండ్రి చాలా ఉద్వేగభరితంగా, వున్నాడు. బాగా చదివి కుటుంబాన్ని చూసుకుంటాడన్న ఆశలతో వున్నాడు. అయితే, యునివర్సిటీలో చేరడానికి ఒక వ్యాసం రాయాలి. మార్క్స ఆ వ్యాసం రాసి, ముందుగా ఆ వ్యాసాన్ని తన కంటే నాలుగేళ్ళు పెద్దదయిన జేన్నీకి చూపించాడు. మరొక విశేషం ఏమిటంటే జెన్నీ అత్యద్భుత సౌందర్య రాశి. వూర్లో ఆమె నడచి వెళుతుంటే అందరూ ఆమెనే చూస్తూ ఉండిపోయేవారు. మార్క్స్ రాసిన వ్యాసాన్ని ఆమె చదివింది. (ఆ వ్యాసం లోని కొన్ని మాటలే ఈ పుస్తకం మొదట్లో వున్నాయి.)

"ప్రపంచంలోని సామాజిక అసమానతల్ని రూపు మాపడమే నా ధ్యేయం" అని పదిహేడు సంవత్సరాల వయస్సులో మార్క్స్ రాసాడు. మార్క్స్ అలా రాయడం జెన్నీకి బాగా నచ్చింది. అంత చిన్న వయసులోనే అంత సుదీర్ఘమైన లక్ష్యలను పెట్టుకున్నాడు. 'అతని ప్రవర్తనా, ఆలోచనా విధానం, వ్యక్తిత్వం చూస్తుంటే అతను అనుకున్నది సాధిస్తాడు అనే నా నమ్మకం' అనుకుని అప్పటి నుండి మార్క్స్ ను ఇష్టపడడం ప్రారంభించింది. ఇద్దరూ తరచూ మాట్లాడుకుంటూ వుండేవారు. అతను వెళ్లిపోతుంటే "మళ్ళీ ఎప్పుడొస్తావు. నిన్ను చూడకుండా ఉండలేను" అనేది. కానీ, మార్క్స్ మాత్రం 'తన అక్క కోసం వస్తున్నది. అలా తనతో కూడా మాట్లాడుతోంది' అనుకునేవాడు.

ఆనాడు ఆ వ్యాసం చూసి మార్క్స్ అంటే అభిమానం పెంచుకున్న జెన్నీ తరవాత కాలంలో అతని భార్య అయింది. నూటికి నూరు శాతం అమలుపరిచింది. తరువాత కాలంలో అతని కష్ట సుఖాల్లో పాలు పంచుకుంది. ఈ 'కష్ట సుఖాలు'అన్న పదంలో సుఖాలు అనేవి కేవలం మూడు, నాలుగు నెలలు మాత్రమే. మిగిలినవన్నీ కష్టాలే. అవన్నీ ఎలా జరిగింది అనేది తరువాత వస్తుంది. ఆ విధంగా జెన్నీ పరిచయం, మార్క్స్ జీవితంలో పెద్ద మార్పుకి దారి తీసింది.

సరే! మళ్ళీ అతని కాలేజీ విషయాల దగ్గరకు వస్తే – తండ్రి అతన్ని కాలేజీ పంపించే సమయంలో, కుటుంబ సభ్యులందరూ సంతోషంగా బోటు ఎక్కించారు. అది "బాన్" యూనివర్సిటి. ట్రియర్ కి దగ్గరలోనే వుంది. పంపించే ముందు చాలా జాగ్రత్తలు చెప్పాడు తండ్రి. "చూడూ! నువ్వు బాగా చదువుకొని ఇంట్లో కుటుంబాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. నా ఆశలూ, కలలూ నీ మీదే పెట్టుకున్నాను." అని చెప్పాడు.

అక్కడకు వెళ్ళాక, మార్క్స్ తండ్రి చెప్పినట్టే న్యాయ శాస్త్రం తీసుకున్నాడు. రాయడానికి పది పేపర్లు తీసుకున్నాడు. తండ్రి చెప్పాడు" అన్ని పేపర్లు తీసుకోవద్దు. ఆరు అయితే సరిపోతాయని." వెళ్ళగానే అతనికి కాస్త అనారోగ్యం గా వుంది. చిన్నతనం నుండి కూడా పెద్దగా ఆరోగ్యమైన మనిషేమీ కాదు. నిజానికి 17,18 సంవత్సరాల వయసు లోనే సైన్యం లో పని చేయాలి. అయితే, అతని ఛాతీ పరిమాణం సరిపోక, సైన్యం లోకి వెళ్ళే అవకాశం తప్పిపోయింది. తను వున్న ట్రియర్ నగరం నుండి, ఈ యునివర్సిటీకి వచ్చేసరికి, ఒక్కసారిగా స్వేచ్ఛ లభించినట్లయింది. అక్కడకు వెళ్ళగానే డబ్బులు ఎక్కువగా ఖర్చు చేయడం మొదలుపెట్టాడు. ముందుగా అనుకున్నట్టుగా మార్క్స్ తండ్రి, డబ్బుని చాలా పొదుపుగా వాడుకునే వాడు. కానీ, మార్క్స్ అవేమీ లక్ష్య పెట్టకుండా తండ్రి పంపించిన డబ్బులు ముందే ఖర్చు పెట్టేసేవాడు. మళ్ళీ పంపించమని ఉత్తరాలు రాసేవాడు.

మార్క్స్, యునివర్సిటీ లో చదువు మాత్రమే కాకుండా, మరి రెండు క్లబ్బుల్లో సభ్యుడిగా చేరాడు. అందులో ఒక క్లబ్బు కవిత్వం రాసేది. అందరూ కవిత్వం రాసి తెచ్చేవారు. అది కొంత వరకూ పర్వాలేదు. మార్క్స్ కూడా కవిత్వం రాసేవాడు. అంతేకాదు, "వాటిని అచ్చు వేయాలి. డబ్బులు పంపించు" అని తండ్రికి వుత్తరం రాసాడు. దానికి తండ్రి "నువ్వింకా చిన్న పిల్లాడివి. కవిత్వం రాసేటంతటి పరిణితి రాలేదు. పుస్తకంగా వేస్తే, పది మంది చదవక పోవచ్చు. "అని జవాబు రాసి, మార్క్స్ ప్రతిపాదనని పక్కకి పెట్టేసాడు. ఇంత వరకూ పర్వాలేదు. ఇక మార్క్స్ చేరిన రెండో క్లబ్బు ఏమిటంటే, సరదాగా, స్వేచ్ఛగా తిరగడం. మద్యపానం సేవించడం. తాగి, తందనాలు ఆడడం.

అదే యునివర్సిటీలో ప్రష్యా రాజ వంశానికి చెందినటువంటి కొంతమంది విద్యార్థులు వుండేవారు. వాళ్ళకీ, వీళ్ళకి తగాదాలు అవుతుండేవి. ఒకసారి వాళ్లతో మల్లయుద్దాలు చేసినపుడు, ఎడమ కంటి మీద చిన్న గాయం కూడా అయింది. ఇవన్నీ వాళ్ళ అమ్మగారికి కూడా తెలిసింది. పైగా ఇంకొకటి ఏమిటంటే, తండ్రి ఉత్తరాలకి, వెంటనే జవాబు రాసేవాడు

కాదు. అప్పుడు మార్క్స్ తల్లి, కొడుక్కి ఒక సుదీర్ఘమైన వుత్తరం రాసింది. 200 వందల సంవత్సరాల తర్వాత, ఇప్పుడైనా ఏ మద్య తరగతి తల్లయినా అలాగే రాస్తుంది. ఏమని?

"నీ గురించి చాలా వింటున్నాను. నువ్వు తాగుతున్నావనీ, రాత్రి పూట ఆలస్యంగా రూముకి చేరుతున్నావనీ, అందరితోనూ తగాదాలు పడుతున్నావని. అది మంచిది కాదు. అంతే కాదు, రూముని శుభ్రంగా ఉంచుకోవడం లేదట. గదిని రోజూ శుభ్రం చేసుకో. రోజూ స్నానం చెయ్యి. తాగితే ఆరోగ్యం దెబ్బతింటుంది. ఆరోగ్యం బాగుంటే, చదువు కోవడానికి బాగుంటుంది." ఇలా రాసింది.

అయితే, అవన్నీ పెద్దగా పట్టించుకునే వాడు కాదు. సమాధానం కూడా ఇచ్చేవాడు కాదు. తండ్రి ఇవన్నీ గమనిస్తూనే వున్నాడు. ఒక రెండు సెమిస్టర్లు అయిన తరవాత, అక్కడ వుంటే గనక, చదువు కొనసాగదు. అనుకొని అక్కడ నుండి అంటే, 'బాన్ ' యూనివర్సిటీ నుండి ఇంటికి రప్పించేసుకొన్నాడు. అది 1836వ సంవత్సరం. అప్పటికి మార్క్సుకు 18వ సంవత్సరం నిండి 19 వ సంవత్సరం నడుస్తున్నది. ఆ కాలంలో 3, 4 నెలలు ఇంటి దగ్గరే అంటే ట్రియర్ లోనే వున్నాడు. అదే సమయంలో జెన్నీ కీ మార్క్సు కీ వున్న పరిచయం వలన, అది ప్రేమగా మారి, వివాహం కూడా చేసుకుందామని నిర్ణయం కూడా చేసుకున్నారు. వయసు ఎక్కువ, తక్కువ అనే విషయం పెద్దగా పట్టించుకోలేదు. జెన్నీ, మార్క్సుతో చెప్పింది.

" నీ భావాలూ, ఆలోచనలూ నాకు నచ్చాయి." అంది. మార్క్సు కూడా అందుకు ఒప్పుకున్నాక నిశ్చితార్ధం చేసుకుందాం అనుకున్నారు. అయితే, వివాహం చేసుకోవడానికి మాత్రం కొంత కాలం ఆగుదాం" అని కూడా అనుకున్నారు. ఈ విషయం తండ్రి తో చెప్పాడు. దానికి తండ్రి ఏమన్నాడంటే, "నీ వయసు చాలా తక్కువ. ఇప్పుడే పెళ్లి చేసుకునే అవసరం ఏం వచ్చింది. ఇంకా చదువు కూడా పూర్తి కాలేదు. ఇప్పటికి రెండు సెమిస్టర్లే అయ్యాయి." అన్నాడు. జెన్నీకి ఒక మారుటి అన్న వున్నాడు. ఆమె కంటే పదేళ్ళు పెద్దవాడు. అతని పేరు "ఫెర్నాడ్" అతను జెన్నీ తండ్రికి మొదటి భార్య వలన పుట్టిన వాడు. ఆమె చనిపోతే, జెన్నీ తల్లిని చేసుకున్నాడు అతను. ఆ అన్నయ్య జెన్నీని చాలా జాగ్రత్తగా చూసుకునేవాడు. అంటే ఎక్కడకీ వెళ్ళకుండా, ఆమెతో ఎవరూ మాట్లాడకుండా. అతను ప్రష్యా రాజ వంశపు సంస్థానంలో పని చేస్తుండే వాడు.

" ఫెర్నాడ్, జెన్నీని అదుపు చేస్తున్నాడు. కొన్నాళ్ళు ఆగితే, మా ఇద్దరి మధ్యా అతను అడ్డు పడతాడు. కాబట్టి, మేము నిశ్చితార్ధం చేసుకుంటాము" అని తండ్రిని ఒప్పించాడు మార్క్స్. ఆ నిశ్చితార్ధం ఎలా జరిగిందంటే, జెన్నీ కుటుంబ సభ్యులకు తెలియకుండా, మార్క్సు కుటుంబ సభ్యుల సమక్షం లోనే జెన్నీ కీ, మార్క్సు కీ 1836 సంవత్సరం వేసవిలో జరిగింది. ఆనాడు జరిగిన నిశ్చితార్ధం తరువాత, జీవిత పర్యంతం ఆ బంధం అలాగే కొనసాగింది.

ఆ నిశ్చితార్థం అయిన తరవాత, మార్క్సును "బెర్లిన్ యునివర్సిటీ "కి పంపించాడు తండ్రి. బెర్లిన్ యునివర్సిటికి వెళ్ళాలంటే, వీళ్ళు ఉంటున్న ట్రయర్ నుండి దాదాపు 5 గంటల ప్రయాణం. నిశ్చితార్థం అయిన తరువాత వెళ్ళాడు కాబట్టి, మార్క్స్ ఆలోచనల్లో జెన్నీ ఎక్కువగా వుండేది. ఆమె గురించి కవిత్వం రాసేవాడు. ఆ రాయడం ఒకటీ, రెండు కాదు. రెండు, మూడు పుస్తకాలే రాసాడు. మొట్టమొదటి సారిగా ఒక పత్రికకు కూడా పంపించాడు తన ప్రేమ కవిత్వం. తర్వాత కాలంలో ఎన్నో సోషలిస్టు పుస్తకాలూ, కమ్యునిస్ట్ పుస్తకాలూ రాసిన మార్క్స్ మొదటి రచన ఒక ప్రేమ కవిత. అలా ప్రేమ ఖైదీగా వుండి, ప్రేమ కవిత్వం రాస్తూ చదువుని ఒక మాదిరిగా కొనసాగిస్తూ వున్నాడు.

బెర్లిన్ లో చేరాక మార్క్స్ భావాలు కొద్ది కొద్దిగా మారడం మొదలయ్యాయి. ఎందుకంటే, అప్పట్లో బెర్లిన్ లో "హెగెల్" అనే తత్వవేత్త ఉండేవాడు. ఆయన ఫిలాసఫీ జర్మన్ ని చాలా ప్రభావితం చేసింది. ఆ రోజుల్లోనే అంటే,1831 లోనే చనిపోయాడు. అంటే, మార్క్స్, బెర్లిన్ వెళ్ళక ముందే. కానీ, ఆయన భావాలను ప్రచారం చేస్తూ, కొంతమంది మిత వాదులు గానూ, కొంతమంది అతి వాదులు గానూ వున్నారు. వాళ్ళను "హెగెలియన్లు" అనేవారు. మార్క్సుకి ఈ హెగెల్ యొక్క ఫిలాసఫీ నచ్చడమే కాకుండా, హెగెల్ భావాల యొక్క అతి వాదుల పక్షంలో చేరాడు. హెగెల్ చెప్పిన తత్వ శాస్త్రానికి మూలమైన ఒకటి, రెండు వాక్యాలు ఏమిటంటే?

"రెండు భావాలు గానీ, రెండు ఆలోచనలు గానీ ఒకదానితో మరొకటి సంఘర్షించుకున్నప్పుడు పోరాటం జరుగుతుంది. ఆ పోరాటం నుండి కొత్త భావం గానీ, కొత్త ఆలోచన గానీ పుడుతుంది. ఆ కొత్త భావం, మరొక భావంతో సంఘర్షించి నపుడు మరొక మరో సరికొత్త కొత్త భావం పుడుతుంది. ఇలా సమాజం ముందుకు పోతుంది. సమాజం పురోగమించే క్రమంలో పోరాటం, సంఘర్షణ అనివార్యమైన భాగాలవుతాయి." అనేది ఒక సూత్రం. ఇది ఒక చిన్న వాక్యం మాత్రమే. అది చాలా పెద్ద పుస్తకం.

అది మార్క్స్ కి నచ్చి, వాళ్ళతో చేరి, ఎక్కువగా చర్చలు చేస్తూ, వాళ్ళతోనే ఉండేవాడు. అతను హైస్కూలులో ఉన్నరోజుల్లో క్రైస్తవ మతం అంటే విపరీతమైన ఆరాధన వుండేది. హైస్కూలులో వుండగా రాసిన వ్యాసాల్లో కూడా "మనిషి పరిపూర్ణుడుగా, నీతిమంతుడుగా వుండాలంటే క్రైస్తవం తప్ప మరో మార్గం లేదు." ఇలాంటి వ్యాసాలు రాసేవాడు. అయితే, ఈ బెర్లిన్ వెళ్ళాక, హెగెల్ తత్వం అనుసరించాక నెమ్మది, నెమ్మదిగా క్రైస్తవ మత ప్రభావం నుండి బయటకు వచ్చి, నాస్తిక భావాల వైపు వెళ్ళాడు మార్క్స్. అయినా, అతనికి 'బాన్' యునివర్సిటీ లో వున్నప్పుడు అలవాటైన మద్యపానం గానీ, అల్లరి చిల్లరగా తిరగడం గానీ తగ్గలేదు. అవి ఇక్కడ కూడా కొనసాగాయి. తరచూ తండ్రి పంపించిన డబ్బులు సరిపోక, అప్పులు చేసేవాడు.

తండ్రి, మార్క్స్ కి ఉత్తరాలు రాసేవాడు. "నీకు 700 వందలు పంపిస్తున్నాను. ఇక్కడ అత్యంత ధనవంతులు కూడా కుటుంబానికి మొత్తం నెలకు 500 మించి ఖర్చు పెట్టరు. అలాంటిది నీకు ఒక్కడికే 700 పంపిస్తున్నాను. అవి

కూడా సరిపోక అప్పులు చేస్తున్నావని తెలిసింది. నా ఆశలన్నీ నీ మీదే పెట్టుకున్నాను. పైగా ఇక్కడ నీకు కాబోయే భార్య జెన్నీఫర్ వుంది. ఆమె గురించి అయినా నీ జీవితాన్ని ఒక క్రమ పద్ధతిలో పెట్టుకో" అని ఉత్తరాల్లో రాస్తుండేవాడు.

బెర్లిన్ కి వెళ్ళేటప్పుడు మార్క్సుకీ, జెన్నీకీ ఒప్పందం ఏమిటంటే, బెర్లిన్ లో చదివినన్ని రోజులూ ఒకరికి ఒకరు ఉత్తరాలు రాసుకోకూడదు. ఎందుకంటే, జెన్నీ తలిదండ్రులకు తెలుస్తుంది. అలా తెలియకుండా వుండాలంటే, మౌనంగా వుండాలని నిర్ణయించుకున్నారు. కానీ, మార్క్స్ అక్కడ వుండగా జెన్నీ కబుర్లు ఎలా తెలుస్తాయి? వాళ్ళ నాన్నేతెలియజేస్తూ ఉండేవాడు. జెన్నీ తండ్రికీ, మార్క్స్ తండ్రికీ స్నేహం కాబట్టి, వాళ్ళ ఇంటికి వెళుతున్నప్పుడు, జెన్ని సమాచారాలు మార్క్సుకు చెబుతుండేవాడు తండ్రి. అలాంటి సమయంలో కూడా తండ్రి చెబుతుండేవాడు" నువ్వంటే, ఆమె ఇంత ప్రేమగా వుంది. నువ్వు అలా అల్లరి చిల్లరగా తిరిగితే, చదువు ఎలా పూర్తి చేస్తావు? వుద్యోగం ఎలా సంపాదిస్తావు? బాధ్యత గల వ్యక్తిగా, బాధ్యత గల భర్తగా ఎలా తయారవుతావు?" అని రాస్తుండేవాడు.

అయితే, మార్క్స్ అల్లరి చిల్లరగా తిరుగుతున్నాడనే విషయాన్నీ, ఊర్లో అందరికీ చెబుతున్న వ్యక్తి జెన్ని అన్నయ్య. "మార్క్స్ చాలా ప్రమాదకరమైన వ్యక్తిగా తయారవుతున్నాడు. ప్రష్యా రాజ్యానికి వ్యతిరేకంగా వుండే వ్యక్తులతో కలసి తిరుగుతున్నాడు. "అని అందరితోనూ చెబుతుండేవాడు.

ఇక్కడ మార్క్స్ చదువు బాగానే వుంది. అతని భావాలూ, వాదనలూ అందరికీ నచ్చుతున్నాయి. కానీ, అల్లరి మానక పోవడం, డబ్బులు విపరీతం ఖర్చు పెట్టడం, తండ్రికి ఉత్తరాలు రాయకపోవడం మాత్రం మానలేదు. మార్క్స్ ధోరణి, తండ్రికి బాధా, నిరాశా, నిస్పృహ కలిగించాయి. అదే రోజుల్లో తండ్రికి క్షయ వ్యాధి అని తెలిసింది. ఆ రోజుల్లో క్షయ వ్యాధి చాలా ప్రాణాంతకమైనది.1838 ఫిబ్రవరి లో మార్క్స్ కి తండ్రి చిట్ట చివరిసారిగా బాధతో ఒక వుత్తరం రాసాడు. "చూడబ్బాయ్! నీకు చెప్పాల్సినవన్నీ చెప్పాను. పెద్దవాడివి కదాని, ఎన్నో ఆశలూ, కలలూ పెట్టుకున్నాను. మన కుటుంబాన్ని చూసుకుంటావనీ, నీకు కాబోయే భార్య పట్ల బాధ్యత గల భర్తగా ఉంటావని అనుకొన్నాను. నీకు ఎంత చెప్పినా గానీ, నీ ప్రవర్తన మార్చుకోలేదు. నా ఆరోగ్యం కూడా దిగజారి పోతున్నది." అని రాస్తూ, "ఇన్ని మాటలు చెప్పానని, నీ మీద కోపం లేదు. నీ మీద ప్రేమతో కోపం తెచ్చుకొని యింతగా రాస్తున్నాను. నేను ఎప్పుడు మరణిస్తానో నాకే తెలియదు. ఒక్కసారిగా నా హృదయం నిండుగా దగ్గరకు తీసుకొని కౌగిలించు కోవాలని వుంది. నువ్వు మంచి మనిషిగా మారితే చూడాలని వుంది. నా జీవిత కాలంలో అది తీరేటట్లు లేదు." అని చివరి వుత్తరం రాసాడు.

ఆ ఉత్తరం రాసిన రెండు నెలలకి 1838 మే లో మార్క్స్ ఇంటికి, అంటే, ట్రయర్ కి వచ్చాడు. ఇంటికి రావాలంటే 5 రోజులు పడుతుందని అనుకున్నాం కదా! ఇంటివద్ద కొన్ని రోజులు వున్నాడు. పుట్టిన రోజు అయిన తర్వాత తిరిగి బయలు దేరాడు. మార్క్స్ తిరుగు ప్రయాణంలో ఉండగానే 1838 మే 13 న తండ్రి చనిపోయాడు. అతను యూనివర్సిటీకి వెళ్ళిన తరువాత తెలిసింది తండ్రి చనిపోయిన సంగతి. తెలిసినా వెనక్కి వెళ్ళలేక పోయాడు. ఎందుకంటే,

అతని దగ్గర డబ్బులు లేవు. దాంతో ఇక చేసేదేమీ లేక వుండి పోయాడు. అయతే, మార్క్స్ కి కూడా తండ్రంటే చాలా ప్రేమ వుండేది. తండ్రికి గుర్తుగా అతని ఫోటోను తన జేబులో 24 గంటలూ, అతని జీవితాంతమూ వుంచుకున్నాడు. ఎంతగా అంటే, చివరకు మార్క్స్ మృత దేహం పై తండ్రి ఫోటోను పెట్టారు అతని మిత్రులు. అంతగా ప్రేమించాడు. కాకపోతే, అతని విద్యార్థి జీవితంలో, ఆ దుడుకు తనంతో తండ్రి చేత పదేపదే చెప్పించు కోవలసి వచ్చింది.

**(కొనసాగింపు వచ్చేనెలలో)**

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 ఫిబ్రవరి 1 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు
https://youtu.be/mHmmPGyc1_s

COMMENTS